ఈనాడు
శ్రీ సత్యసాయి
బుధవారం సెప్టెంబరు 25, 2024

గుర్తుకొస్తున్నాయ్..

సైకిల్ తొక్కిన రాష్ట్ర మంత్రి సవిత


విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కుతున్న మంత్రి సవిత

దశాబ్దాల కిందట సైకిల్ తొక్కిన రోజులు గుర్తుకొస్తున్నాయంటూ విద్యార్థులతో కలిసి బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత సైకిల్ తొక్కారు. మంగళవారం గోరంట్ల మండలంలోని మల్లాపల్లిలో చదువుతున్న పేద విద్యార్థులు గ్రామాల నుంచి సమయానికి పాఠశాలకు చేరుకోవడానికి ఆ పంచాయతీకి చెందిన తెదేపా నాయకులు సొంతనిధులతో సైకిళ్లను ఏర్పాటుచేశారు. వాటిని మంత్రి పంపిణీ చేశారు. దాతలు మహమ్మద్, వెంకటరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణస్వామి, పాఠశాల కమిటీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లను అభినందించారు. - న్యూస్‌టుడే, గోరంట్ల

ఒక ఛైర్మన్.. ఐదుగురు సభ్యులు

ఉమ్మడి జిల్లాకు నామినేటెడ్ పోస్టులు



ఈనాడు డిజిటల్, అనంతపురం: ఉమ్మడి జిల్లాకు చెందిన తెదేపా నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కాయి. మంగళవారం వివిధ శాఖల కార్పొరేషన్లు, బోర్డులు, కౌన్సిళ్లు, సొసైటీలకు సంబంధించి ఛైర్మన్లు, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీపక్‌రెడ్డిని సీడాప్ (ఉద్యోగ కల్పన, వ్యాపారాభివృద్ధి సొసైటీ) ఛైర్మన్‌గా.. ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురుని వివిధ కార్పొరేషన్ల సభ్యులుగా నియమించారు. నెల్లూరు జిల్లాకు చెందిన **దీపక్‌రెడ్డి** వ్యాపార నిమిత్తం అనంతపురం జిల్లా రాయదుర్గానికి వచ్చారు. ఇక్కడే తెదేపాలో కొనసాగుతూ పార్టీ కోసం పనిచేశారు. ఈయన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అల్లుడు. 2012 ఉప ఎన్నికల్లో తెదేపా ఆయన్ను రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టింది. ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. 2014లో టికెట్ ఆశించినా దక్కలేదు. 2017లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలపడంతో ఎన్నికయ్యారు. అప్పటి నుంచి పార్టీలో కీలకంగా ఉంటూ వస్తున్నారు. గత ఎన్నికల్లోనూ రాయదుర్గం టికెట్ ఆశించారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు కన్వీనర్‌గా వ్యవహరించారు.

సభ్యులు వీరే.. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ సభ్యుడిగా రాయదుర్గానికి చెందిన పి.పురుషోత్తం నియమితులయ్యారు. 2014-19 మధ్యలో రాయదుర్గం మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. బత్తలపల్లికి చెందిన గోనుగుంట్ల విజయ్‌కుమార్‌ను పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ సభ్యుడిగా కొనసాగనున్నారు. విజయ్‌కుమార్ తల్లి జయమ్మ, తండ్రి అనంతరెడ్డి ఎమ్మెల్యేలుగా పనిచేశారు. ధర్మవరానికి చెందిన తెదేపా రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్యను రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా నియమించారు. కాటమయ్య తెదేపా ఆవిర్భావం నుంచి పని చేస్తున్నారు. అమడగూరుకు చెందిన బుక్య కాలేనాయక్‌ను పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ సభ్యుడిగా కొనసాగనున్నారు. గుంతకల్లుకు చెందిన జిల్లా పరిషత్తు మాజీ ఛైర్మన్ కుమారుడు కేసీ హరికుమార్‌ను మార్క్‌ఫెడ్ సభ్యుడిగా నియమించారు.

ప్రాణాలతో రెవెన్యూ చెలగాటం!

- అర్జీల పరిష్కారంపై అలసత్వం
- సమస్య పరిష్కరించకనే ముగింపు

ఈనెల 23న పామిడికి చెందిన సూర్యనారాయణ.. తనకు సంబంధించిన 1.54 ఎకరాలకు పట్టా ఇవ్వాలని కోరుతూ రెండేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. భూ రీసర్వే మూలంగా పట్టా ఇవ్వకుండా రెవెన్యూ యంత్రాంగం ముప్పతిప్పలు పెట్టింది. తుదకు పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. రెవెన్యూ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైంది.

ఆగస్టు 19న బొమ్మనహాళ్ మండలం తారాకపురానికి చెందిన గడ్డం సుంకన్న అనే వృద్ధుడు తన భూమిని కబ్జా చేశారని.. సత్వరమే న్యాయం చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా ఫలితం లేదు. విధిలేక అక్కడి మండల తహసీల్దారు కార్యాలయ ఆవరణలో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు. సకాలంలో పోలీసులు కాపాడి బళ్లారి ఆస్పత్రికి తరలించారు.

జిల్లా సచివాలయం, పుట్టపర్తి, న్యూస్‌టుడే

ఎన్నో కష్టాలతో 'రెవెన్యూ' కార్యాలయాలకు చేరే బాధితులకు స్వాంతన చేకూరడం లేదు. అర్జీలు ఇచ్చామన్న మాటే గాని.. పరిష్కారం చూపడం లేదు. ఉన్నతాధికారుల ఒత్తిడి ఉందన్న కారణంతో పరిష్కరించని అర్జీలకు ముగింపు పలుకుతున్నారు. గతంలో 75 శాతం అర్జీదారుల్లో అసంతృప్తి ఉన్నట్లు ఐవీఆర్ఎస్ ద్వారా తేటతెల్లమైంది. బాధిత ప్రజలు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కనికరించే నాథుడే కరవయ్యాడు. బాధితులతో కనీసం ఐదు నిమిషాలు మాట్లాడినా సమస్య తీర్చే అవకాశం లభిస్తుంది. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోనే కాదు... డివిజన్, మండల తహసీల్దారు, మున్సిపల్ కార్యాలయాల్లో అర్జీలు తీసుకుని పంపిస్తున్నారు. నిర్దేశిత గడువు తీరే సమయంలో హడావుడిగా పరిష్కారించాం..అంటూ ఆన్‌లైన్‌లో ముగించేస్తున్నారు. ఇదొక తంతుగా కొనసాగుతోంది. బాధితుడు సంతృప్తి వ్యక్తం చేస్తేనే.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వెబ్‌సైట్‌లో ముగించాలి. ఇలా అధికారులు అమలు చేయకపోవడంతో బాధితుల్లో తీరని వ్యథ మిగులుతోంది.

ఇష్టారాజ్యంగా..

రెవెన్యూ శాఖ ఎంతో కీలకం. తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్ఓ... ఇలా ఎవరు ఎప్పుడు కార్యాలయాలకు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో అంతుచిక్కని పరిస్థితి. పని భారం సాకుతో విధులను సరిగ్గా నిర్వర్తించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దయనీయం ఏమంటే... తహసీల్దారు కార్యాలయంలోనే ఇవ్వాల్సిన భూమి 'అడంగల్' కోసం శెట్టూరు నుంచి ఓ బాధితుడు కలెక్టరేట్‌కు రావడం విశేషం. నేరుగా కలెక్టర్‌ను కలిసి విన్నవించడంతో వెలుగులోకి వచ్చింది.

✦ ఇటీవల ఎన్‌పీ కుంట మండలం రామాపురం తండాకు చెందిన పీరమ్మ.. శ్రీసత్యసాయి కలెక్టరేట్‌కు వచ్చారు. నాన్న నుంచి సక్రమించిన ఆస్తిని.. రెవెన్యూ అధికారులు మరొకరి పేరుపై మార్చేశారని.. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోలేదంటూ పురుగు మందు డబ్బా వెంట తెచ్చుకున్నారు. భద్రతా సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకుంది. సర్వే నంబరు 1023-5లో 2.67 ఎకరాల్లో భూమి ఉంది. అధికారులు మా నాన్నకు కుమారులు లేరని... మా పెద్దనాన్న కుమారుడు పేరుపై మార్చేశారు. న్యాయం చేయాలని తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



భూ సమస్యలే అధికం..

గత వైకాపా పాలనలో భూఆక్రమణలు, దౌర్జన్యాలు.. పట్టాల మార్పిడి.. వంటి బాగోతాలు కుప్పలు తెప్పలుగా తెరపైకి వచ్చాయి. వాటి పరిష్కారంపై గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. తెదేపా కూటమి ప్రభుత్వం రాగానే బాధితులు తమ గోడు వినిపించుకోడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అధిక సంఖ్యలో వస్తున్నారు. ప్రతి సోమవారం సుమారు 300 అర్జీలు వస్తుంటాయి. ఇందులో 60-70 శాతం కేవలం రెవెన్యూ శాఖకు చెందినవే ఉంటున్నాయి. కబ్జాలు, పట్టాలు.. వంటి వాటిపై అర్జీలు వస్తున్నాయి.

శ్రీసత్యసాయి జిల్లాలో జూన్ 23 నుంచి ఈ నెల 23 వరకు అర్జీలు ఇలా..

మొత్తం	రెవెన్యూ	ఇతర శాఖలో
1,630	968	662

వినతులపై ప్రత్యేక దృష్టి

- టీఎస్ చేతన్, కలెక్టర్, శ్రీసత్యసాయి

జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. తహసీల్దార్, డివిజన్ కార్యాలయాల్లోనే ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలివ్వడం జరిగింది. భూసమస్యలే అధికంగా వస్తున్నాయి. జిల్లాలో వ్యవసాయ భూములకంటే అధికంగా పాసుపుస్తకాలు ఉన్నాయి. వీటివల్లే సమస్యలు వస్తున్నాయి. వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తాం.

ఇదే తరహాలోనే కుల, ఆదాయ పత్రాలు ఇవ్వలేదంటూ పుట్లూరు నుంచి మూడు వారాల క్రితం ఓ మహిళ తన బిడ్డను వెంటపెట్టుకుని కలెక్టరేట్‌కు వచ్చింది. అప్పటికపుడు కలెక్టర్ ఆయా మండలాల తహసీల్దార్లతో మాట్లాడాల్సి వచ్చింది. చిన్న చిన్న సమస్యలను కూడా తీర్చకుండా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారు. తాజాగా.. సూర్యనారాయణ మృతి, గడ్డం సుంకన్న ఆత్మహత్యాయత్నం.. వంటి ఘటనలు రెవెన్యూ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

రీలింగ్ యూనిట్లకు కొత్తచిక్కులు

- పట్టుగూళ్లు లేక ప్రశ్నార్థకంగా భవిష్యత్తు
- ఉపాధికి దూరం అవుతున్న కార్మికులు


హిందూపురంలో రీలింగ్ యూనిట్లు అధికంగా ఉన్న సిల్క్‌కాలనీ

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే

గిట్టుబాటు లేక అంతంత మాత్రంగా నడుస్తున్న రీలింగ్ యూనిట్లకు కొత్త సమస్య వచ్చి పడింది. స్థానిక మార్కెట్‌కు బైవోల్టిన్ పట్టుగూళ్లు రావటం తగ్గిపోవటంతో రీలింగ్ యూనిట్లకు సరిపడే పట్టుగూళ్లు అందుబాటులో లేక వాటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. స్థానికంగా ధరలు తక్కువగా ఉన్నాయని రైతులు కర్ణాటకలోని రాంనగర్ మార్కెట్‌కు పట్టుగూళ్లు తీసుకెళ్తున్నారు. కొంతకాలం నుంచి మార్కెట్‌లో గూళ్ల ధరలు పెరిగినా రైతులు తీసుకురావటం లేదు. ప్రతి రోజూ 5 నుంచి 6 టన్నుల బైవోల్టిన్ గూళ్లు మార్కెట్‌కు వచ్చేవి. ప్రస్తుతం 2, 3 టన్నులకు తగ్గిపోయాయి. మార్కెట్ గూళ్లపై ఆధారపడిన రీలింగ్ సగానికి సగం నిలబడి పోతున్నాయి. దీంతో వీటిపై ఆధారపడిన దాదాపు రెండు వేల మంది కార్మికులకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రీలింగ్ యూనిట్లున్న ప్రాంతాలు
సిల్క్‌కాలనీ, శాంతినగర్, భరత్‌నగర్, మేళాపురం, రహమత్‌పూర్
యంత్రాలు
మల్టీఎండ్ 95, చరకాలు 15, కాటన్ బేషన్‌లు 12
ఉపాధి పొందుతున్న కార్మికులు
2వేల మంది


మల్టీఎండ్ రీలింగ్ యూనిట్

ధరలు పెరిగినా ఆసక్తి చూపని రైతులు

ఇటీవల మార్కెట్‌లో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు సరాసరి కిలో రూ.450 నుంచి రూ.600 వరకు పలుకుతున్నాయి. అయినా రైతులు గూళ్లను ఇక్కడికి తేవడంలేదు. ప్రధానంగా మడకశిర ప్రాంతం రైతులు అధికంగా రాంనగర్ మార్కెట్‌కు వెళుతున్నారు. గతంలో బైవోల్టిన్ గూళ్లకు ధరతో సంబంధం లేకుండా ప్రభుత్వం కిలోకు రూ.50 ప్రోత్సాహ మొత్తం అందించేది. కొన్నేళ్లుగా ఇది సక్రమంగా రైతులకు అందకపోవడంతో గూళ్లు తీసుకురావడానికి ఆసక్తి కనబరచటం లేదు.

ఇబ్బందులు పడుతున్న యజమానులు

6 బేషన్ల మల్టీఎండ్ రీలింగ్ యూనిట్ పనిచేసేందుకు రోజుకు 70 నుంచి 80 కిలోల గూళ్లు అవసరం. ప్రస్తుతం వారంలో సగం రోజులు కూడా నడిచేందుకు సరిపడే గూళ్లు అందుబాటులో దొరకటం లేదు. దీని వల్ల లక్షలాది రుపాయలు వెచ్చించి రీలింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకొన్న యజమానులు కొనసాగించలేక ఇబ్బంది పడుతున్నారు.

వారంలో మూడు రోజులే..



రీలింగ్ యూనిట్‌ను కొనసాగించేందుకు అవసరమైన పట్టుగూళ్లు మార్కెట్‌లో దొరకటం లేదు. వారంలో మూడు రోజులు రీలింగ్ యూనిట్లు నడిచే స్థితికి చేరుకొన్నాయి. మార్కెట్‌లో సిల్క్ ధర కిలో రూ.4,200 నుంచి రూ.4,500 వరకు పలుకుతోంది. ఈ ధరలు ఏమాత్రం గిట్టుబాటుగా లేవు. అధికారులు చర్యలు తీసుకొని మార్కెట్‌కు అధికంగా గూళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- ఎస్.ఫయాజ్, రీలింగ్ యూనిట్ యజమాని, హిందూపురం

రోజూ పని దొరకటం కష్టంగా ఉంది



గతంలో రీలింగ్ యూనిట్ల ద్వారా వారం రోజులు పనిదొరికేది. కొంత కాలంగా వారంలో మూడు రోజులే ఉంటుంది. దీనివలన కుటుంబాలను పోషించుకోవటానికి ఇబ్బందులుపడుతున్నాం. ఈ వృత్తికి అలవాటు పడినందున ఇతర పనులు చేయటానికి ఇబ్బందిగా ఉంది.

-షేక్‌ఇస్రాత్, కార్మికురాలు, హిందూపురం

రాంనగర్‌తో పోటీ పడుతున్నాం..

- సురేశ్, పట్టుపరిశ్రమ సహాయ సంచాలకులు, హిందూపురం

కర్ణాటకలోని రాంనగర్ మార్కెట్‌లో ఉన్న ధరలు ఇక్కడ పలుకుతున్న సగటు ధరలతో మనం పోటీ పడుతున్నాం. ఒక్కోసారి అక్కడి సగటు ధరలకన్నా ఇక్కడే అధికంగా ఉంటున్నాయి. నాణ్యమైన గూళ్లకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తోంది. ఇక్కడ వంద శాతం నగదు లావాదేవీలు కొనసాగుతున్నాయి. అందువలన రైతులు ఇక్కడి మార్కెట్‌కు గూళ్లు తెస్తే తగిన గిట్టుబాటు లభిస్తుంది.

పట్టు రైతులూ.. 'ఈనాడు' మీతోడుగా..

బైవోల్టిన్ పట్టు రైతులకు అందాల్సిన ప్రోత్సాహక బకాయిలు, రాయితీలు, పథకాలు, సాగులో ఇబ్బందులు, పాటించాల్సిన మెలకువలపై పట్టు పరిశ్రమ శాఖ జేడీ (జాయింట్ డైరెక్టర్) దుగ్గిరాల పద్మావతితో ఫోన్‌లో సంప్రదించే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. పట్టు రైతులు కింది ఫోన్ నంబర్లలో సంప్రదించి.. జేడీ ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఎప్పుడు: ఈనెల 26వ తేదీ (గురువారం)
సమయం: ఉదయం 11గంటల నుంచి 12 గంటలలోపు
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 98666 99198, 80085 73039

వైకాపా మాజీ ప్రజాప్రతినిధి సోదరుడి..

కబ్జాపర్వం

ఈనాడు డిజిటల్, అనంతపురం: గత వైకాపా ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు రెచ్చిపోయారు. భూమి ఖాళీగా కనబడితే చాలు కబ్జా చేసేశారు. భూయజమానులను బెదిరించి విలువైన ప్రైవేటు స్థలాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల్ని గుప్పిట్లో పెట్టుకుని సాగించిన భూఆక్రమాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. రాప్తాడు వైకాపా ప్రజాప్రతినిధిగా పనిచేసిన నాయకుడి సోదరుడు దౌర్జన్యంగా ఓ విశ్రాంత ఉద్యోగికి చెందిన భూమిని ఆక్రమించిన ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. కబ్జా చేయడమే కాకుండా.. అక్రమ రిజిస్ట్రేషన్ చేయించి ఇతరులకు విక్రయించారు. బహిరంగ మార్కెట్‌లో భూమి విలువ ప్రస్తుతం రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. తెదేపా కూటమి ప్రభుత్వం గతంలో జరిగిన భూఅక్రమాలపై ఫిర్యాదులు స్వీకరించి విచారణ జరుపుతోంది. దీంతో బాధితుడు సోమవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌తో.. రాప్తాడు పొలం పరిధి 4-4, 5-3, 6-2 సర్వే నంబర్లలోని 2 ఎకరాల భూమిని అనంతపురం నగరానికి చెందిన విశ్రాంత ఉద్యోగి పి.లక్ష్మణ్ణ, గుత్తికి చెందిన యజమాని నుంచి 1985లో కొనుగోలు చేశారు. 2001 నుంచి 2010 వరకు 3 సెంట్ల చొప్పున 8 ప్లాట్లు విక్రయించారు. మిగిలిన 1.76 ఎకరాలు అలాగే ఉంది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాళీగా ఉన్న సదరు స్థలంపై స్థానిక నాయకుల కన్ను పడింది. అప్పటి ప్రజాప్రతినిధి సోదరుడి ద్వారా పావులు కదిపారు. లక్ష్మణ్ణను ప్రజాప్రతినిధి వద్దకు పిలిచి సగం భూమి ఇవ్వాలని బెదిరించారు. అంగీకరించకపోవడంతో పాత యజమాని వారసుల నుంచి భూమి అక్రమంగా రాయించుకున్నారు. సదరు భూమి హక్కుదారు లక్ష్మణ్ణ అయినప్పటికీ సంబంధం లేని వ్యక్తుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్లాట్లు వేసి కొన్నింటిని ఇతరులకు విక్రయించారు. తన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు అప్పట్లోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గతేడాది ఏప్రిల్‌లో కోర్టు ఇంజెక్షన్ ఉత్తుర్వులు జారీ చేసింది. అప్పటి ప్రజాప్రతినిధి సోదరుడి ఒత్తిళ్లతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్లను కొనసాగించడం గమనార్హం.

ప్రసాదం అపవిత్రంపై పురంలో నిరసన

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: కోట్లాది మంది ప్రజలు ఆరాధించే కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం హిందూపురంలో తెదేపా, జనసేన, భాజపా, హిందూఐక్యవేదిక నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ కూడలిలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వీరు తహసీల్దార్ కార్యాలయం చేరుకొని ఈ సంఘటనకు పాల్పడిన వారిపై తగిన విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో గోవధ నిషేధించాలని, వక్ఫ్‌బోర్డు తరహా హిందూదేవాలయాల ఆస్తుల పరిరక్షణకు ఒక చట్టం తీసుకురావాలని సీనియర్ సహాయకుడు గురుమూర్తికి వినతిపత్రం అందజేశారు.


అంబేడ్కర్ కూడలిలో బైఠాయించి నిరసన తెలుపుతున్న కూటమి, హిందూ ఐక్యవేదిక నాయకులు, కార్యకర్తలు

క్వారీ పేలుళ్లు.. ఆందోళనలో ప్రజలు


సోమందేపల్లి: పాపిరెడ్డిపల్లి చెరువు వద్ద భారీ పేలుళ్లు జరుపుతున్న వేలుపుకొండ


సోమందేపల్లి, పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక పాపిరెడ్డిపల్లి-వెలగమేకలపల్లి గ్రామాల మధ్య కంకర క్వారీలో భారీ పేలుళ్లతో పలు గ్రామాల ప్రజలు, రైతులు భయం గుప్పెట్లో జీవనం సాగిస్తున్నారు. ఆరేళ్లుగా ఇక్కడి క్వారీలో చేపడుతున్న పేలుళ్ల దాటికి కిలోమీటరు దూరంలో ఉన్న ఏడు గ్రామాల పంట పొలాలు, గృహాలు దెబ్బతింటున్నాయి. భారీ పేలుళ్లకు రాళ్లు ఎగిసిపడి పొలాల్లో పడటం, వేగంగా టిప్పర్ల రాకపోకలతో దుమ్ము-దూళి తమ పంట పొలాలపై పడుతుండటంతో దిగుబడులు దెబ్బతిని వందలాది మంది రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు.

బాధిత గ్రామాలు	జనాభా	ఆవాసాలు	దెబ్బతిన్నవి
పాపిరెడ్డిపల్లి	62	450	20
వెలగమేకలపల్లి	120	600	25
వెలగమేకలపల్లి తండా	30	100	10
నాగినాయనిచెరువు	200	650	20
నాగినాయనిచెరువు తండా	200	700	30
నలగొండ్రాయనపల్లి	150	500	10
గుడిపల్లి	300	850	10

కొండ పక్కనే కస్తూర్బా గురుకులం

క్వారీకి 200 మీటర్ల దూరంలోనే కస్తూర్బా విద్యాలయం నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉంటున్న 250 మంది విద్యార్థినులు, సీఆర్టీలు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం అక్కమ్మ గుడి దెబ్బతిని తమ మనోభావాలతో చెలగాట మాడుతున్నారని వేలుపుకొండ అక్కమ్మ గుడి పరిరక్షణ కమిటీ సభ్యులు బీలా నాయక్, రాయప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, శంకర్ నాయక్, ఆంజనేయులు, రంగప్ప, నరసింహులు, హనుమంతు, గ్రామాల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్వారీని వెంటనే ఆపేసి తమకు న్యాయం చేయాలని కమిటీ సభ్యులు, రైతులు, ప్రజలు మంత్రి ఎస్.సవితను వేడుకొంటూ వినతిపత్రం అందించారు.

గృహాలు, పంట పొలాలకు నష్టం..



పేలుళ్ల దాటికి ఇళ్లు, పంటలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నారు. గృహాలకు పగుళ్లు ఏర్పడి, ఎప్పుడు నేలకూలుతాయో అర్థం కావడం లేదు. పొలాలు బీళ్లుగా మారాయి. వెంటనే ప్రభుత్వం, అధికారులు ఈ క్వారీని నిలిపి వేయించి, ఏడు గ్రామాల ప్రజలు, రైతులను కాపాడాలి. - రాయప్ప, రైతు, వెలగమేకలపల్లి

సామగ్రి కిందపడి..



వేలుపుకొండలో వెలసిన అక్కమ్మ అమ్మవారు ఏడు గ్రామాల ప్రజలకు ముఖ్యంగా తండా వాసులకు అరాధ్య దైవం. ఈకొండ పేలుళ్లతో మొత్తం గుట్టపై ఉన్న తమ తండాలో భూమి కంపించి, ఇంట్లో సామగ్రి ఒక్కసారిగా కింద పడుతున్నాయి. పిల్లలు, వృద్ధులు, మహిళలు భయపడి బయటకు పరుగులు తీస్తున్నారు. వెంటనే క్వారీని మూయించాలి.

- సరోజబాయి, కూలీ, నాగినాయనిచెరువు తండా.


కలెక్టర్‌కు నివేదిక పంపుతాం..

వెలగమేకలపల్లి వద్దనున్న కంకర క్వారీని సీఐ రాఘవన్, ఎస్సై రమేశ్‌బాబుతో కలిసి తనిఖీ చేశాం. అక్కడి పరిస్థితిని పరిశీలించాం. క్వారీ పేలుళ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఇటీవల మంత్రి ఎస్.సవితకు వినతిపత్రం అందించిన కస్తూర్బా విద్యార్థినులు, సీఆర్టీలతో కలిసి విచారణ చేపట్టాం. ఈమేరకు త్వరలోనే పూర్తిస్థాయిలో కలెక్టర్‌కు నివేదిక పంపుతాం. -గంగాశంకర్, ఇన్‌ఛార్జి తహసీల్దార్, సోమందేపల్లి.

ప్రశాంత జీవనం గడపాలి

తాడిపత్రి, న్యూస్‌టుడే: కక్షలు కార్పణ్యాలకు పోకుండా ప్రశాంతమైన జీవనం గడపాలని పరమావధి జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ శివప్రసాదయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తాడిపత్రి సబ్‌జైలును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జైలులో పరివర్తన చెంది అందరూ ఎలాంటి గొడవలకు పోకుండా కుటుంబాన్ని చూసుకుంటూ ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు.

ఉద్యాన కోర్సు.. ఉపాధికి ఉషస్సు





ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల

మడకశిర, హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంత యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఉద్యాన పాలిటెక్నిక్ విద్య ఎంతో ఉపయోగ పడుతోంది. భవిష్యత్తులో ఉద్యోగం చేసుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించడానికి అవకాశాలు ఉన్నాయి. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పట్టణ పరిధిలోని పెనుకొండ రోడ్డులో ఏర్పాటు చేసింది. రాష్ట్ర విభజన వల్ల ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న సమయంలో 2014 తెదేపా ప్రోత్సాహంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు రైతులకు ఎన్నో వన్నెదన్నుగా నిలుస్తున్నారు.

231 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

మడకశిర ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సులో 60 సీట్లు కేటాయించారు. పదో తరగతి పూర్తికాగానే ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సుకు దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేస్తారు. ప్రస్తుతం ఈ ఏడది 42మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటివరకు 15 బ్యాచ్‌లు పూర్తి కాగా 519మంది విద్యార్థులు కోర్సును పూర్తి చేశారు. ఇందులో 231మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా, 72మంది బీఎస్సీ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేశారు. మిగిలిన వారు ప్రైవేటు రంగంలో స్థిరపడ్డారు.

రైతులకు సేవలు అందించడంలోనే ఆనందం



కళాశాలలో విద్యార్థి స్థాయిలోనే రైతులకు పంటల సాగు, అధిక దిగుబడులు సాధించడానికి ఎన్నో సలహాలు ఇచ్చాం. 2011-13లో మడకశిరలో కోర్సు పూర్తి చేసి ప్రైవేటు ఉద్యోగాలు చేశాను. ప్రస్తుతం సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. తల్లిదండ్రులు హోటల్ నిర్వహిస్తూ చదివించి ఈ కోర్సు పూర్తి చేయించారు. సచివాలయంలో కూడా రైతులకు సేవలు అందిస్తుండటం సంతోషంగా ఉంది.

- సబీహా, వీఏఓ, సోమందేపల్లి

గొర్రెల కాపరిగా ఉంటూ చదివించారు



మా నాన్న గొర్రెల కాపరిగా ఉంటూ నన్ను చదివించారు. గుత్తి మండలంలోని ఊబిచర్ల గ్రామం నుంచి మడకశిర ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో 2015-17లో కోర్సు పూర్తి చేశాను. ప్రస్తుతం ఊబిచర్ల గ్రామ సచివాలయంలోనే గ్రామ ఉద్యావన సహాయ అధికారిగా పనిచేస్తున్నాను. తల్లిదండ్రులు పడిన కష్టాన్ని ఒమ్ము చేయకుండా చదువుకున్నాను.

- బాలాజీనాయక్, వీఏఓ, గుత్తి మండలం

టైలరింగ్ చేస్తూ..



మడకశిర పాలిటెక్నిక్ కళాశాలలో 2015-17లో చదువుకున్నాను. మంచి విద్య అందించడంతో కోర్సు పూర్తి చేశాను. తండ్రి అమీర్ బాషా టైలరింగ్ చేసి నన్ను చదివించారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని సచివాలయ పరీక్ష రాసి మొదట్లోనే ఉద్యోగం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

- షాజాద్, వీఏఓ, నల్లచెరువు

కొలువులకు దోహదం



10వ తరగతి పూర్తికాగానే రెండేళ్లలో ఉద్యోగం సాధించడానికి, మరింత ఉన్నత చదువులు చదువుకోవడానికి పాలిటెక్నిక్ కోర్సులు ఎంతగానో దోహదపడతాయి. మడకశిర ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో 75శాతం మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేసుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. విద్యార్థులకు ఉద్యాన పంటల పెంపకం, రైతులకు సలహాలు ఎలా ఇవ్వాలనే దానిపై కళాశాల స్థాయిలోనే నేర్పిస్తాం. చదువుతో పాటు క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించారు.

- రమణ, ప్రిన్సిపల్

'కేతిరెడ్డి వల్లే శాంతిభద్రతలకు విఘాతం'



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గొడవలకు ప్రేరేపించి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'కేతిరెడ్డి ఎన్నికల్లో ఓటమి పాలైనా ఇంకా అధికారంలో ఉన్నాననే భ్రమలో ఉన్నారు. రౌడీలను వెంటబెట్టుకొని తిరుగుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. గత వైకాపా ప్రభుత్వంలో బదిలీపై వచ్చిన డీఎస్పీ శ్రీనివాసులు కేతిరెడ్డికి అనుకూలంగా పని చేస్తున్నారు. సబ్‌జైలు కూడలి వద్ద భాజపా వాహనాలకు కేతిరెడ్డి వాహనాన్ని అడ్డు పెట్టి గొడవకు కారణమయ్యారు. నేను ఘటనా స్థలానికి వెళ్లి ప్రజలు, కార్యకర్తలను సర్దిచెప్పి పంపించాను. లేని పక్షంలో కేతిరెడ్డి ప్రజాగ్రహానికి గురయ్యేవాడని' అన్నారు. కేతిరెడ్డికి అనుకూలంగా పని చేస్తున్న డీఎస్పీతోపాటు గ్రామీణ సీఐ నరేంద్రపై సీఎం, డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

కసాపురం ఆలయ ఈఓగా వాణి బాధ్యతల స్వీకారం

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే కసాపురం ఆలయ ఈఓగా కె.వాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా కాణిపాకం ఈఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. నూతన ఈఓకు ఆలయ అధికారులు, అర్చకులు, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ శుభకాంక్షలు తెలిపారు.

భూ హక్కు చట్టం రద్దుతో ఆస్తుల భద్రతకు భరోసా



మాట్లాడుతున్న ఎంపీ బీకే, చిత్రంలో మంత్రి సవిత తదితరులు

గోరంట్ల, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం చేసిన భూ హక్కు చట్టం రాష్ట్రాన్ని వణికించిన నేపథ్యంలో తెదేపా అధికారంలోకి రాగానే ఎన్నికల హామీలో భాగంగా ల్యాండ్‌టైటిల్‌యార్టు రద్దుతో ప్రజల ఆస్తుల భద్రతకు సీఎం చంద్రబాబునాయుడు భరోసా కల్పించారని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మంత్రి, ఎంపీ బీకే పార్థసారథి మంగళవారం మండలంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బూదిలి పంచాయతీలోని పాపిరెడ్డిపల్లిలో ఇది మంచి ప్రభుత్వం, సీమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ, పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సంపద ఎలాసృష్టించాలి, సంక్షేమ పథకాలు ఎలా పేదల ధరిచేర్చాలి, పరిశ్రమలు ఎలా తీసుకురావాలని అహర్నిశలు ముఖ్యమంత్రి కష్టపడుతున్నారని వారు పేర్కొన్నారు. వంద రోజుల్లో చేపట్టిన పథకాలను వివరించారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ గోరంట్ల మండల ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హంద్రీనీవా కాలువ ద్వారా సాగునీరు తప్పక తీసుకొస్తామన్నారు. నాయకులు సోమశేఖర్, దేవానరసింహప్ప, సుధాకరరెడ్డి, అజ్మతుల్లా, రాజశేఖరరెడ్డి, నటరాజు, బహ్మచారి, నాగభూపాల్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, రవి, శంకరరెడ్డి, గిరిధర్‌గౌడ్, రాజశేఖరప్ప కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్ అందిస్తాం: సునీత

రూ.10 లక్షల శుద్ధజల కేంద్రం ప్రారంభం



ఆత్మకూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, నాయకులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా అనర్హులై ఉండి పింఛన్లు పొందుతున్న వారిని తొలగించి అర్హులకు అందిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని గొరిదిండ్ల, ముట్టాల, ఆత్మకూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వైకాపా హయాంలో అర్హత లేకున్నా నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పింఛన్లను పెద్ద ఎత్తున పొందారని వివరించారు. అలాంటి వారిని త్వరలోనే గుర్తించి తొలగిస్తామని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజుల్లోనే పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల ప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, విజయవాడ ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు లాంటి అనేక పనులు చేసిందన్నారు. గొరిదిండ్లలో గ్రీన్‌కో విండ్‌మిల్ సంస్థ సహకారంతో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ తెదేపా నాయకుడు సందీప్ చౌదరి ఆధ్వర్యంలో గ్రామస్థులకు తాగునీటి క్యాన్లను ఉచితంగా అందజేశారు. అనంతరం ముట్టాల, ఆత్మకూరు బీసీ కాలనీలో రూ.2.60 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పాపంపల్లిలో శ్మశాన వాటికకు స్థలం చూపాలని ప్రజలు విన్నవించగా స్థలం చూపాలంటూ రెవెన్యూ సిబ్బందికి సూచించారు.



శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదుట దీక్షలో కూర్చున్న నాయకులు

కూటమి నాయకుల దీక్ష

కదిరి పట్టణం: కలియుగదైవం శ్రీవెంకటేశ్వరస్వామి ప్రసాదం కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉపముఖ్యమంత్రి ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా కూటమి నాయకులు, హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు మంగళవారం కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఎదుట దీక్ష చేపట్టారు. హిందూవుల మనోభావాలు దెబ్బతినేలా తిరుమల ప్రసాదాల్లో కల్తీచేసిన పూర్వపు పాలకమండలి ఛైర్మన్లతో పాటు అప్పటి పాలకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో జనసేన నాయకులు భైరవప్రసాద్, శివశంకర్, లక్ష్మణ్, రవి, అనూరాధ, షమీమ్, భాజపా నాయకులు గంగాధర్, రమేశ్, రవిచంద్ర, మైనోద్దీన్, వీహెచ్ రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పనితీరుపై 'క్యూఆర్ కోడ్'

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047పై ప్రజల్లో విస్తృత అవగాహన కలిపించడమే కాదు.. ప్రభుత్వ పనితీరుపై ప్రజల నుంచి స్పందన కోసం ప్రత్యేకంగా 'క్యూఆర్ కోడ్'ను తీసుకొచ్చిందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజల స్పందన ప్రక్రియ కోసం నిర్దేశిత నమోదు చేసే కార్యక్రమం ఈనెల 26లోపు వంద శాతం పూర్తి చేయాలన్నారు. మంగళవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా, నియోజకవర్గ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎమ్పీడీఓ.. వంటి అధికారులతో వీక్షణ సమీక్ష నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2047, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలపై విరివిగా అవగాహన కార్యక్రమాలు జరపాలన్నారు. గ్రామ, వార్డుల్లో ఇంటింటా తిరగాలి. అభివృద్ధి స్టిక్కర్లు, కరపత్రాలను అందజేయాలని కలెక్టర్ సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లోనూ అతికించాలి. ప్రజల సలహా, సూచనలు తీసుకోవాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు పేరు తేవాలి



క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్న జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేఈ అనిల్‌కుమార్

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొంటున్న క్రీడాకారులు రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేఈ అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. విజయవాడలోని సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో 25, 26 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన సీనియర్ మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారులు మంగళవారం హిందూపురం నుంచి బయలదేరారు. వీరిని జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి బీకే మహ్మద్‌సలీమ్, కోశాధికారి శేఖర్, ఎంజీఎం పాఠశాల పీడీ లోక్‌నాథ్‌లు క్రీడా దుస్తులు అందించారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: పీహెచ్‌సీ వైద్యులు నష్టం కలిగిస్తున్న జీవో నంబరు 85ను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యుల సంఘం నేతలు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. గతంలో ఉన్న విధంగానే పీహెచ్‌సీ వైద్యులకు పీజీ సీట్ల కోటాలో 30 శాతం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం అనంతపురంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో వారు మాట్లాడారు. విధులు బహిష్కరించి నాలుగు రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పీజీ సీట్ల కోటా 15కు తగ్గించటంతో తీవ్రంగా నష్టపోతామని వివరించారు.

రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

గుత్తి, న్యూస్‌టుడే : నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరుకు వెళ్తున్న కర్ణాటక వాసి సోమవారం రాత్రి రైల్లో నుంచి కింద పడి మరణించాడు. కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి మండలం కనేకల్‌కు చెందిన మల్లికార్జున(30) బెంగళూరులో తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. అతను తన భార్యా పిల్లలతో బెంగళూరులో ఉంటున్నారు. తనతోపాటు ఉన్న చెల్లిని కనేకల్‌కు తీసుకొని వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బెంగళూరుకు వెళ్తుండగా రైల్లో వాకిలి వద్ద నిద్రమత్తులో కూర్చొని ఉండగా గుత్తి శివారులో తురకపల్లిరోడ్డులోని రైలు వంతెన వద్ద కింపడిపోయాడు. తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతిచెందాడు. జీఆర్‌పీ పోలీసులు మృతదేహానికి మంగళవారం పంచానామా నిర్వహించారు.

శస్త్రచికిత్స వికటించి.. గర్భిణి పరిస్థితి విషమం

ప్రభుత్వ వైద్యుడి సొంత క్లినిక్‌లో నిర్వహణ



చికిత్స పొందుతున్న రాధ



క్లినిక్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: కడుపు నొప్పితో సర్వజనాసుపత్రికి వచ్చిన తన భార్యకు అక్కడే వైద్యం అందించకుండా ఆ విభాగంలో పనిచేసే ఓ నర్సు దారి మళ్లించి ప్రభుత్వ వైద్యుడి సొంత క్లినిక్‌కు వెళ్లాలని సూచించారని.. తీరా అక్కడికి వెళ్లాక నిర్లక్ష్యంగా శస్త్రచికిత్స చేశాడని కూడేరు మండలం హంసాపల్లికి చెందిన రామానాయుడు ఆరోపించారు. వైద్యుడు శస్త్రచికిత్స చేసిన అనంతరం యూరిన్ రాకపోవడంతో విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా మళ్లీ సర్వజనాసుపత్రికే తీసుకెళ్లమని చేతులెత్తేసినట్లు వివరించాడు. మళ్లీ సర్వజనాసుపత్రికి వెళ్లగా కర్నూలు తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారన్నారు. కర్నూలు తీసుకెళ్లి పరీక్షలు చేయించగా గర్భసంచి శస్త్రచికిత్స చేసే సమయంలో పీసీఎన్‌ఎల్ కట్ చేశారని, తిరిగి అతికించకపోవటంతో సమస్య ఏర్పడిందని నిర్ధారించినట్లు వివరించారు. అప్పటికే భార్య వైద్యానికి రూ.1.50 లక్షలు ఖర్చు అయిందని భర్త వాపోయాడు. ఆమె కోలుకోవాలంటే మరో రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని మరో మూడు శస్త్రచికిత్సలు చేయాల్సి ఉందని చెప్పడంతో మళ్లీ అనంతపురానికి వచ్చి ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపాడు. దీనిపై డాక్టర్ రమణానాయక్‌ను కలిసి నిలదీయగా.. తనకు సంబంధం లేదని సమాధానమివ్వడంతో సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్, డీఎంహెచ్‌వో, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌లను వేర్వేరుగా కలిసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించాడు.

ఈ ఘటనపై సాయంత్రం బాధితురాలితో లావణ్య ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ఈబీదేవి ని ఆదేశించారు. డీఎంహెచ్‌వో ప్రైవేటు వైద్యశాల వద్దకు చేరుకొని బాధితులతో మాట్లాడారు. బాధితురాలి వైద్యానికి అయ్యే వ్యయం సంబంధిత వైద్యుడు చెల్లిస్తారని తెలిపాడు. స్టాఫ్ నర్సు, వైద్యుడిపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. లావణ్య ఆసుపత్రికి సంబంధించి క్లినిక్‌కు మాత్రమే అనుమతిచ్చామని, శస్త్రచికిత్సకు అనుమతి లేదని వెల్లడించారు. క్లినిక్‌కు నోటీసులు జారీ చేస్తామన్నారు.

ప్రభుత్వ స్థలంపై కబ్జాదారుల కన్ను

విపణి ధర రూ.6 కోట్ల పైమాటే



దేవరకొండ వద్ద విలువైన ప్రభుత్వ స్థలం ఇదే

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : బుక్కరాయసముద్రం పంచాయతీలో పవిత్రమైన దేవరకొండ క్షేత్రం దగ్గర ఉన్న రూ. కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాజేయడానికి కొంతమంది పెద్దలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బుక్కరాయసముద్రం రెవెన్యూ గ్రామ పరిధిలో దేవరకొండ వద్ద 1.5 ఎకరాలను ఓ వ్యక్తికి పాసుపుస్తకంలో ఎక్కించారు. నిబంధనల ప్రకారం ఆ భూమిలో పంటలు మాత్రమే సాగు చేయాలి. ఈ భూమి అనంతపురానికి శివారులో ఉండటం, జగనన్న కాలనీ ఈ భూమి ఎదురుగా ఏర్పాటు కావడంతో మంచి డిమాండు ఏర్పడింది.

మూడెకరాలు ప్లాట్లుగా చేసి..

వైకాపా ప్రభుత్వ హయాంలో కొందరు వైకాపా నాయకులు భూమిని చేజిక్కించుకుని 1.5 ఎకరాలకు తోడు పక్కనే ఉన్న దేవరకొండ స్థలాన్ని 1.5 ఎకరాలు చదును చేసి కలిపేసుకున్నారు. మొత్తంగా 3 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయించడానికి యత్నించగా బుక్కరాయసముద్రం ప్రజలు, కొండమీద వేంకటరమణ స్వామి భక్తులు అడ్డగించారు. అప్పట్లో 'ఈనాడు'లో కథనం రావడంతో కలెక్టర్ జోక్యం చేసుకుని భూమి అన్యాక్రాంతం కాకుండా అడ్డుకున్నారు. తాజాగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కొంతమంది పెద్దలు ఈ స్థలాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పునాదులు తవ్వడానికి స్థలంలో రాళ్లను వదిలారు. ఇది మండల వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ మూడు ఎకరాల ప్రభుత్వ స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 6 కోట్లకు పైమాటే. ఇంతటి విలువైన స్థలం అన్యాక్రాంతం కాకుండా ప్రజల కోసం వినియోగించాలని, లేదా కొండమీదరాయుడి ఆలయం పేరుతో ఉద్యానవనం ఏర్పాటు చేయాలని మండల ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. ఈ విషయంపై తహసీల్దారు పుణ్యవతిని వివరణ కోరగా స్థల ఆక్రమణ గురించి ఇప్పటికే మా దృష్టికి వచ్చిందని, స్థలాన్ని పరిశీలించి బోర్డు ఏర్పాటు చేశామన్నారు. స్థలంలోకి ఎవరూ ప్రవేశించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

భాజపా, జనసేన నాయకులపై కేసు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం సబ్‌జైలు కూడలి వద్ద తనపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, భాజపా నాయకులు డోలా రాజారెడ్డి, హరీష్, ప్రవీణ్ దాడి చేశారని వైకాపా విద్యార్థి సంఘం నాయకుడు అమరనాథ్‌రెడ్డి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ నలుగురిపై కేసు నమోదు చేశారు. తనపై భాజపా నాయకుడు హరీశ్, ప్రవీణ్‌తోపాటు మరో నలుగురు దాడి చేశారని ఒక టీవీ ఛానల్ రిపోర్టర్ రమేష్ ధర్మవరం ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రికెట్ బెట్టింగ్ గుట్టు రట్టు

♦ 19 మంది బుకీల అరెస్టు ♦ రూ.8.60 లక్షల నగదు, 2 కార్లు, 19 చరవాణులు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న అనంతపురం గ్రామీణం డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, సీఐ హేమంత్‌కుమార్, ఎస్సై విజయ్‌కుమార్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్డీటీ మైదానంలో జరిగిన దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారాన్ని జిల్లా పోలీసులు ఛేదించారు. కర్ణాటక, హరియాణా రాష్ట్రాలకు చెందిన 19 మంది బుకీలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8.60 లక్షల నగదు, 2 కార్లు, 19 చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన శివానందగౌడ, లోహిత్, మధు, గురుప్రశాంత్, బీఎస్ విశ్వాస్, యోగేశ్, అరుణ్, వికాశ్, నవీన్‌కుమార్, రోహిత్, మోహన్‌కుమార్, అరుణ్‌కుమార్..హరియాణాకు చెందిన సోంబీర్‌సింగ్, సందీప్ కుమార్, తుషార్ వాద్వా, కౌశల్ ఖురానా, అంకిత్ జాంగ్రా, ధీరజ్ చుగ్, అనుభవ్ కుమార్‌లు నిందితులుగా తేల్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను అనంతపురం గ్రామీణం డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్, ఎస్సై విజయ్‌కుమార్‌లతో కలిసి రాప్తాడులోని సబ్‌డివిజనల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు.


హరియాణా నుంచి వచ్చి..

ఆర్డీటీ మైదానంలో జరిగిన భారత ఎ,బి,సి,డి గ్రూపు ఆటగాళ్లు తలపడుతున్న దులీప్‌ట్రోఫీ మ్యాచ్‌లకు 12 మంది బెంగళూరు నుంచి, ఏడుగురు బుకీలు హరియాణా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనంతపురం చేరుకున్నారు. నిందితుల్లో శివానందగౌడ కీలకపాత్ర పోషించాడు. ఇతని మిత్రుడు అభి ద్వారా పోర్చుగల్‌కు చెందిన ప్రధాన బుకీ పాల్ పరిచయమయ్యాడు. పాల్ సూచనతో.. టెస్కాన్ అనే వ్యక్తికి ఆర్డీటీలో జరిగిన భారత్ ఎ, సి జట్ల మ్యాచ్‌ల లైవ్ కామెంటరీని ఇచ్చి బెట్టింగ్‌కు సహకరించాడు.

● సదరు మ్యాచ్‌లో వచ్చిన డబ్బును సోమవారం (23న) నిందితులు ఆర్డీటీ మైదానం ఎదురుగా ఉన్న పాలవీరనాగమ్మ ఆలయం సమీపంలోని ఓ హోటల్ ఆవరణలో పంపకాలు చేసుకుంటుండగా సమాచారం అందుకున్న ఇటుకలపల్లి సీఐ సర్కిల్ సిబ్బంది, డీఎస్పీ క్రైం పార్టీ, ఎస్పీ ప్రత్యేక బృందం మెరుపు దాడులు నిర్వహించి అరెస్టు చేశారు. వారి నుంచి నగదు, కార్లు, చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి జిల్లా కోర్టు ఎదుట ప్రవేశపెట్టగా, వారికి కోర్టు రిమాండ్ విధించింది.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర



కాణిపాకంలో ప్రశంసా పత్రాలు అందుకున్న పెనుకొండ కూచిపూడి నృత్య విద్యార్థులు

కూచిపూడిలో విద్యార్థుల ప్రతిభ

పెనుకొండ పట్టణం,న్యూస్‌టుడే: స్థానిక హైందవి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు సోమ వారం చిత్తూరు జిల్లాలోని కాణిపాకంలో వెల సిన వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో నిర్వహించిన శాస్త్రీయ నృత్యం కూచిపూడిలో అత్యంత ప్రతిభ కనపర్చారు. కూచిపూడి నృత్యం చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసినట్లు మాస్టర్ రమేశ్ వివరించారు.

పంటల సాగులో మెలకువలపై అవగాహన



పంటల సాగులో మెళకువలు, జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా అన్ని మండలాల్లో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. పంట పొలాలను పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు. -న్యూస్‌టుడే బృందం

సబ్ రిజిస్ట్రార్‌గా నరసింహమూర్తి

మడకశిర, న్యూస్‌టుడే: మడకశిర సబ్ రిజిస్ట్రార్‌గా పి.నర సింహులు మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతపు రంలో పనిచేస్తున్న ఆయన బదిలీ పై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్ అవినీతి అధికారులకు పట్టుబడ టంతో కేసు నమోదు చేసి సస్పెండ్ చేశారు. 5 నెలలుగా ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్‌గా భాగ్యలక్ష్మి విధులు నిర్వహించారు.

బిందు పరికరాలు కాల్చారని ఫిర్యాదు

రొద్దం, న్యూస్‌టుడే: కోగిర గ్రామానికి చెందిన రాజ్‌గో పాల్‌రెడ్డి అనే రైతుకు చెందిన బిందు పరికరాలను దుండ గులు మంగళవారం కాల్చివేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవలే పక్క తోటకు అమర్చిన డ్రిప్ పరికరాలు తొలగించి వాటిని పక్క పొలంలో నిల్వ చేశామ న్నారు. ఇదే గ్రామానికి చెందిన అశ్వర్థరెడ్డి ఉద్దేశ పూర్వ కంగా వీటిని కాల్చివేశారని రొద్దం పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. రూ.2 లక్షలు విలువ చేసే పరికరాలు కాలి పోయాయని బాధితుడు న్యాయం చేయాలని కోరారు.

ప్రహరీ లేక ఇబ్బందులు



కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రికి చుట్టుపక్కల వంకలు, కంపచెట్లు ఉండడంతో విషపురుగుల బెడద అధికంగా ఉంది. కొండపక్కనే ఆసుపత్రి ఉండడంతో రాత్రిళ్లలో విధులు నిర్వ హించే మహిళా సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రికి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేశ్ మాట్లా డుతూ ప్రహరీ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా మని తెలిపారు. -న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

దుర్గంధం మధ్య జీవనం

వ్యర్థాలు, పొగతో స్థానికులు, విద్యార్థుల ఇబ్బందులు

ప్రాంతం అహ్మద్‌నగర్ | జనాభా : 3,500 నుంచి 4వేల మంది | సమస్య: ఏళ్లుగా డంపింగ్ యార్డులో చెత్త పేరుకు పోవటం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలోని అహ్మద్‌నగర్ సమీపంలోని డంపింగ్ యార్డులో ఏళ్ల కొద్ది వ్యర్థాలు పేరుకొని దుర్వాసన, దోమలబెడ దతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్గంధం వస్తుండటంతో స్థానికులు భరించలేక అనారోగ్యాల భారిన పడుతున్నారు. రెండేళ్ల కిందట ఇక్కడ ఉన్న డంపింగ్ యార్డును పెద్దగుడ్డంపల్లి సమీపంలోకి మార్చినా పట్టణంలోని వ్యర్థాలను ఇక్కడే వేస్తుండటంతో మళ్లా గుట్టలా పేరుకుపోయాయి. కొందరు గుర్తుతెలి యని వ్యక్తులు దీనికి నిప్పంటిస్తుండ టంతో పొగను స్థానికులు పీల్చలేక రోగాల భారిన పడుతున్నారు. వ్యర్థాలను తరలించి కాలుష్యం నుంచి తమను కాపా డాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా వారు పట్టించుకోవటం లేదని స్థాని కులు వాపోయారు.

సమీపంలోనే పాఠశాల..

కాలనీలో డంపింగ్ యార్డు సమీపంలో సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉంది. దాదాపు 40 మంది విద్యార్థులు ఉన్నారు. డంపింగ్‌యార్డు నుంచి దుర్వాసన వస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గాలి వీచినప్పుడు ఈ వాసన హస్నాబాద్, మోతుకపల్లి, ముద్దిరె డ్డిపల్లి ప్రాంతాల వరకు వెళ్తుండటంతో ఈ ప్రాంతం వారు ఇబ్బందులకు గురవుతు న్నారు.

చెత్త దూరంగా తరలిస్తున్నాం

డంపింగ్ యార్డు పెద్దగుడ్డంపల్లి సమీ పంలో ఏర్పాటు చేసిన ప్పటి నుంచి ఇక్కడికి చెత్త తరలించం లేదు. ఇక్కడ నిల్వ ఉన్న చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ త్వరలో చేపట్టబోతున్నాం. **- శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్**



అహ్మద్‌నగర్ సమీపంలో డంపింగ్ యార్డులో వ్యర్థాలు

బోధించేందుకు ఇబ్బందిగా ఉంది



డంపింగ్ యార్డు నుంచి నిత్యం దుర్వాసన వస్తుండ టంతో విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నా ఇబ్బందిగా ఉంటోంది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దుర్వాసనతో కూడిన ఈ గాలిని విద్యార్థులు పీల్చుతుండటంతో తరచూ అనారోగ్యాల భారిన పడుతున్నారు.

- మహ్మద్‌ఇజాద్, ఉపాధ్యాయుడు, ఉర్దూ పాఠశాల

చిన్నపిల్లలకు శ్వాసకోశ వ్యాధులు



గర్భిణులు, చిన్నారులు ఈ గాలిని పీల్చుతుండటంతో చిన్నప్పటి నుంచే శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ చెత్తను ఇతర ప్రాంతానికి తరలించా లని అధికారులను కోరినా పట్టించుకోవటం లేదు. వయసుతో సంబంధం లేకుండా అందరూ దీంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధి కారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

- లక్ష్మీదేవి, అహ్మద్‌నగర్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: రాళ్లపల్లిలో పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. **-మహ్మద్**
సమాధానం: వెంటనే మరమ్మతులు చేయిస్తాం. **-లక్ష్మీనారాయణ, సర్పంచి,**
సమస్య: ముతుకూరు, జటికేపల్లి రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. **- సిద్ధగంగప్ప,**
సమాధానం: కంపచెట్లు తొలగింపజేస్తాం. **-రామారావు, ఎంపీడీఓ, గుడిబండ**
—న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: మధుగిరి రహదారి గుంతలుగా మారింది. **-శంకర్, రామాపురం**
సమాధానం: మరమ్మతులు చేయిస్తాం.
-శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ డీఈ మడకశిర
సమస్య: ఇరిగేపల్లి గొల్లహట్టిలో తాగు నీరు వృథా అవుతోంది. **-నాగరాజు**
సమాధానం: వృథా నీటిని అరికడతాం. **-రంగనాథ్, కార్యదర్శి**
—న్యూస్‌టుడే, అగళి

స్పందనకు వందనం

గుడిబండ: మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను మేమున్నాం.. మీకుతోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురించగా బాధ్యులు స్పందించారు. మోరుబాగల్ ఇందిరమ్మ కాలనీలో సర్పంచి తిప్పేస్వామి హరితరాయబారుల ద్వారా మురుగును తొలగించారు. పీఎన్‌పాళ్యంలో దేవరహట్టి సర్పంచి సతీశ్‌బాబు వీధి దీపాలు ఏర్పాటుచేసి అంధకారం తొలగించారు.

లేపాక్షి: నాగానిపల్లిలో సర్పంచి నందిని, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర పారిశుద్ధ్య కార్మికులతో మురుగు తొలగించారు. మల్లిరెడ్డిపల్లిలో కార్యదర్శి లక్ష్మప్ప వీధి దీపాలు ఏర్పాటు చేసి అంధకారాన్ని తొలగించారు.

పరిగి : పరిగి చెరువు మరవలో ప్రజలకు తాగునీటి అందిస్తున్న చేతి పంపు మరమ్మతులకు గురైందన్న వార్తకు పంచాయతీ కార్యదర్శి అరుణ స్పందించారు. మరమ్మతు చేయించి నీటి సమస్యను పరిష్కరించడంతో బోయపేట వాసులు హర్షం వ్యక్తం చేశారు.

నాయీబ్రాహ్మణులకు చేయూత అందిస్తాం



జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప తదితరులు

హిందూపురం అర్బన్, న్యూస్ టుడే: తరతరాలుగా కులవృత్తిపై ఆధా రపడి జీవనం సాగిస్తున్న నాయీబ్రా హ్మణులకు తగిన చేయూత అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక రైల్వే సామూహిక భవనంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరుపుకొన్నారు. సమావేశంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. ఈ వృత్తిపై ఆధారపడిన వారు తరచూ అనారోగ్యాల భారిన పడుతున్నారని, గీత కార్మికుల తరహాలో వీరికి పింఛన్ సదుపాయం అందించాలని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానన్నారు. రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం కన్వీనర్ నాగరాజు, జిల్లా తెదేపా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పట్టణ తెదేపా అధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్, భాజపా నాయకులు రమేశ్‌రెడ్డి, నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సోమందేపల్లి, న్యూస్ టుడే: రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన చోదకుడు మహేంద్ర ఇసుకను అక్రమంగా సోమందేపల్లికి సోమవారం అర్ధరాత్రి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా స్వాధీనం చేసుకొన్నట్లు ఏఎస్సై మురళీమోహన్ తెలిపారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ గంగాశంకర్ ఎదుట మంగళవారం చోదకుడిని హాజరుపర్చగా రూ.2వేల జరిమానా విధించారని ఏఎసై వివరించారు.

కళాశాలకు మంచి పేరు తేవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఐఈఓ రఘునాథరెడ్డి

హిందూపురం సాంస్కృతికం (చిన్నమార్కెట్), న్యూస్ టుడే: విద్యార్థినులు జేఈఈ, నీట్, ఎంసెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని డీఐఈఓ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని చిన్నమార్కెట్ సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కళాశాల రికార్డులను, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రిన్సిపల్ అనురాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడిబండ గురుకులానికి మోక్షం

రూ.38 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం



అసంపూర్తిగా గురుకుల పాఠశాల భవనం

మడకశిర, న్యూస్‌టుడే : గుడిబండలో అర్ధాంతరంగా ఆగిన గురుకుల బీసీ బాలికల పాఠశాల భవనాలకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తెదేపా ప్రభుత్వ హయాంలో 2016లో గురుకుల పాఠశాల, కళాశాలను మంజూరు చేయగా అప్పట్లో భవనాల నిర్మాణానికి రూ.25కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి 2019 నాటికి 60శాతం పూర్తి చేశారు. అంతలోనే ప్రభుత్వం మారింది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో రూ.38కోట్లు మంజూరు చేశారు.

విద్యార్థులకు తప్పనున్న ఇబ్బందులు

గుడిబండ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల భవనాలు వైకాపా ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులు మడకశిరలోని ఓ ప్రభుత్వ భవనంలో, కళాశాల విద్యార్థులు గుడిబండలోని ఐకేపీ భవనంలో తరగతులు నిర్వహించారు. ఇరుకు గదులు కావడంతో విద్యార్థులు అవస్థలు పడుతూ చదువుకున్నారు. నిధులు మంజూరు కావడంతో భవనాలు పూర్తయితే ఇబ్బందులు తొలగుతాయి.

త్వరితగతిన పూర్తి చేయిస్తాం

గత పాలకులు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. గుడిబండలో గురుకుల బీసీ పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయించి విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకొస్తాం. **- ఎం.ఎస్.రాజు, ఎమ్మెల్యే, మడకశిర**

చంద్రబాబుతో సుపరిపాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు

గుడిబండ, న్యూస్‌టుడే: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రజల కష్టాలను అర్థం చేసుకుంటూ సుపరిపాలన సాగిస్తున్న ఏకైక సీఎం చంద్రబాబునాయుడేనని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు పేర్కొన్నారు. గుడిబండ మండలం ముతుకూరులో తెదేపా మండల కన్వీనర్ మద్దనకుంటప్ప అధ్యక్షతన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమ బహిరంగ సభ మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. ముతుకూరు చెరువును దత్తతకు తీసుకుని అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, రహదారులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీనిధి సంఘాలకు రూ.17.89 కోట్లు విడుదల కాగా రూ.16.50 లక్షల చెక్కును ముతుకూరు మహిళా సంఘాలకు అందించారు. కేకేపాళ్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

రొద్దం : సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి స్పష్టం చేశారు. ఈమేరకు ఆయన సొంత గ్రామమైన ఆర్‌మరువపల్లి బీసీ కాలనీలోని సచివాలయం -2లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి సతిశేఖర్, తెదేపా ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతు చేస్తే జీవాలకు తాగు నీరు



కడతదహళ్లి గ్రామ సమీపంలో 8 ఏళ్ల కిందట పశువుల కోసం తాగునీటి తొట్టి ఏర్పాటు చేశారు. నీళ్లు వదలక పోవడంతో బీటలు వారింది. మరమ్మతు చేస్తే గ్రామంలో ఉన్న పశువులు, గొర్రెలు, మేకలకు పుష్కలంగా తాగునీరు అందనుంది. ఈ విషయాన్ని ఎంపీడీవో భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా డ్వామా అధికారులతో మాట్లాడి పశువులకు నీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

-న్యూస్‌టుడే, అమరాపురం

గురుకులం చుట్టూ కంపచెట్లు



అగళి ఆదర్శ పాఠశాల ప్రహరీ వద్ద కంపచెట్లు పెరగడంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. బాలికల వసతి గృహం పక్కనే ఉండడంతో కంపచెట్లలో అడవి జంతువులు రాత్రి వేళ్లలో నివాసం ఉండే అవకాశం ఎక్కువగా ఉంది. పాఠశాల ప్రిన్సిపల్ మహ్మద్ జాఫర్ మాట్లాడుతూ ప్రహరీ వద్ద ఉన్న కంపచెట్లను తొలగించేందుకు పంచాయతీ వారికి విన్నవిస్తామన్నారు. - న్యూస్‌టుడే, అగళి

సంక్షిప్త సమాచారం

క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: ఆటల పోటీల్లో గెలుపోటములు సర్వసాధారణమని, ప్రతి క్రీడాకారుడిలోనూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే ఎస్‌జీఎఫ్ లక్ష్యమని గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు ఎన్.వి. మురళీధర్‌బాబు, ఎంఈవో లక్ష్మీదేవి, ఎంఈవో 2 శేషాచలంలు పేర్కొన్నారు. సోమవారం కొడిగెనహళ్లి గురుకుల ఎక్స్‌లెన్స్ పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించే నియోజకవర్గ స్థాయి అండర్ 14, అండర్ 17 క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు.

విద్యార్థి దశ నుంచే సేవాదృక్పథం అలవర్చుకోవాలి

పెనుకొండ పట్టణం : విద్యార్థులు కళాశాల స్థాయి నుంచే సేవా దృక్పథాన్ని అలువాటు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్‌డే నిర్వహించారు. అన్ని మండలాల్లోనూ ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయాభివద్ధికి రూ.లక్ష చెక్కు అందజేత

మడకశిర గ్రామీణం : బుళ్లసముద్రం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర ఆలయానికి శ్రీ ధర్మస్థల మంజునాథస్వామి దేవాలయ ట్రస్ట్ పావగడ పీఓ మహేశ్ లక్షరూపాయల చెక్కును మంగళవారం కమిటీ సభ్యులకు అందజేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మడకశిర గ్రామీణం: గుండుమల కేజీబీవీ బాలికల పాఠశాలలో మంగళవారం ఆర్డీటీ, ఐసీడీఎస్ స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం' అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ, కౌన్సిలర్ బ్రాహ్మణిలు హాజరై అవగాహన కల్పించారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

పరిగి: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు పరిగిలో స్థలం కేటాయించాలని రాష్ట్ర వడ్డె సాధికార సంఘం సభ్యులు వి.హనుమయ్య స్థానిక సచివాలయ కార్యదర్శి అరుణకు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో వడ్డెర కులస్థులు, మహిళలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో వాగ్వాదం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: విరేచనాలతో బాధపడుతున్న కస్తూర్బా విద్యార్థిని ఆమె తల్లి చిట్టెమ్మ సోమందేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి మంగళవారం తీసుకొచ్చారు. తమ కుమార్తెకు సెలైన్ పెట్టాలని స్టాఫ్‌నర్సు సుధాను ఆమె కోరారు. వైద్యాధికారులు హరికుమార్, ఓంకార్ తదితరులు ధర్నాలో ఉన్నారని, వారి పర్యవేక్షణలోనే సెలైన్ ఎక్కించాల్సి ఉంటుందని, మందులు ఇస్తామని తల్లికి నచ్చజెప్పారు. ఆమె ససేమిరా అనడంతో అక్కడ సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న మధుబాబు కలగజేసుకొన్నారు. ఆ విద్యార్థిని తల్లితో దురుసుగా మాట్లాడారని అక్కడే ఉన్న పందిపర్తి గ్రామస్థుడు నబీరసూల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్య పర్యవేక్షకురాలు రత్నమ్మ, స్టాఫ్‌నర్సు సద్దిచెప్పారు.

వెలగమేకలపల్లి క్వారీ తనిఖీ



కార్మికులతో వివరాలు తెలుసుకొంటున్న అధికారులు

సోమందేపల్లి, న్యూస్ టుడే: మండలంలోని వెలగమేకలపల్లి వద్దనున్న కంకర క్వారీని మంగళవారం ఇన్‌ఛార్జి తహసీల్దార్ గంగాశంకర్, సీఐ రాఘవన్, ఎస్సై రమేశ్ బాబు కలిసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇక్కడి వేలుపుకొండలో క్వారీ పేలుళ్ల కారణంగా ఏడు గ్రామాల రైతుల పొలాలు, గృహాలకు నష్టం వాటిల్లుతోందని, కస్తూర్బా విద్యాలయం భవనం కంపిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నామని విద్యార్థినులు, సీఆర్టీలు, కొండపైనున్న అక్కమ్మ గుడి దెబ్బతింటోందని రైతులు, కమిటీ సభ్యులు, ప్రజలు ఇటీవల మంత్రి ఎస్.సవితకు వినతిపత్రాలు అందించారు. మంత్రి ఆదేశాల మేరకు ఆయా అధికారులు క్వారీ వద్ద తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. వీఆర్‌వో నాగరాజు, సర్వే సహాయకుడు రఘు, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా



నరసింహప్పకు నగదు అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు

మడకశిర గ్రామీణం: హెచ్ ఆర్‌పాళ్యంలో మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పర్యటించారు. గ్రామంలోని నరసింహప్ప కుటుంబ సభ్యులు ఏళ్లుగా బాత్‌రూం గదిలో నివాసముంటున్న సమాచారం తెలుసుకుని అక్కడకు వెళ్లారు. కలెక్టర్‌తో మాట్లాడి కొత్త ఇల్లు మంజూరు చేయించారు. కొత్త ఇల్లు నిర్మించుకునేంత వరకు గ్రామంలో ఓ అద్దె ఇంటిలో నివాసం ఉండాలని, అందుకు అవసరమైన అద్దె చెల్లిస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద రూ.20వేలు ఆ కుటుంబానికి అందించారు.

నడిచేదెలా.. వాహనాలు వెళ్లేదెలా?

రహదారిపైనే నిలిపివేత.. పట్టించుకోని అధికారులు

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రమంచిలో కియా పరిశ్రమ వచ్చిన తరువాత పట్టణ జనాభా రెట్టింపు అయ్యింది. మండలంలో ఉపాధి పెరగడంతో ప్రజల అవసరాలకు ద్విచక్రవాహనాల సంఖ్య భారీగా పెరిగిపోయింది. ఇటీవల పెరిగిన జనాభా, వాహనాలకు అనుగుణంగా పట్టణంలో రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరణ చేశారు. ప్రధాన కూడళ్లలో విస్తరణ పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం పెనుకొండలో 44వేల జనాభా ఉన్నారు. పెనుకొండ రెవెన్యూ డివిజన్, నియోజకవర్గం కేంద్రం కావడంతో 13 మండలాల నుంచి వివిధ పనులపై ప్రజలు పట్టణానికి వస్తుంటారు. ప్రధానంగా పట్టణంలోని ఎన్టీఆర్‌కూడలిలో సాయంత్రం 6గంటల తరువాత ట్రాఫిక్ అంతరాయం అధికంగా ఉంటోంది. ద్విచక్రవాహనాలు ప్రధాన రోడ్డుపై నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. ఎన్టీఆర్ కూడలిలో రోడ్డు పక్కన తోపుడు బండ్ల పై ఫాస్ట్‌ఫుడ్ ఓ వైపు, మరోవైపు బేకరీలు, టీ దుకాణాలు ఉన్నాయి. ఇదే సమయంలో కియా, అనుబంధ పరిశ్రమల కార్మికులను దించేందుకు, ఎక్కించుకునేందుకు బస్సులు పదుల సంఖ్యలో రావడంతో జన సంచారం అకస్మాత్తుగా పెరుగుతోంది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు అడ్డంగా నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది. రోడ్డు విస్తరణలో అధికారులు నిబంధనల ప్రకారం చేపట్టకపోవడం వల్లనే రోడ్డు కుచించుకుపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని ప్రజలు చర్చించుకొంటున్నారు. ఎన్టీఆర్ కూడలిలో గతంలో ట్రాఫిక్ అంతరాయం వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రోడ్డులో ఆక్రమణలు ఎక్కువ అవడంతో దుకాణాల ముందు ప్రధాన రోడ్డుపై వాహనాలు నిలిపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణలు తొలగించి రోడ్డు పక్కన వాహనాలు నిలిపేవిధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.



ఎన్టీఆర్‌కూడలి వద్ద ఓ టీస్టాల్ ఎదుట సగం రోడ్డుపై ఇలా..

రోడ్డుపై ఉంచితే చర్యలు..

రాజేశ్, ఎస్సై, పెనుకొండ: ప్రధాన రోడ్డుపై అడ్డంగా వాహనాలు నిలిపితే అపరాధ రుసుం విధించి చట్టప్రకారం చర్యలు చేపడతాం. సాయంత్రం సమయంలో కూడళ్లలో ప్రత్యేక నిఘా ఉంచుతాం. వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపితే చర్యలు చేపడతాం.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముగ్గురికి తీవ్ర గాయాలు

లేపాక్షి , న్యూస్‌టుడే : హిందూపురం గ్రామీణ మండలం సుబ్బిరెడ్డిపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. లేపాక్షి ఎస్సీ కాలనీకి చెందిన సురేష్ భార్య నాగమణి, కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంలో సింగిరెడ్డిపల్లి నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు వారిని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టవర్ పైనుంచి పడి కార్మికుడికి ..

రొద్దం, న్యూస్‌టుడే : విద్యుత్తు టవర్ నిర్మాణ పనుల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన రూబెల్ అనే కార్మికుడు ప్రమాదవశాత్తు 22మీటర్ల ఎత్తు నుంచి కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. క్షతగాత్రున్ని 108వాహనంలో పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రాజు

పావగడ, న్యూస్‌టుడే : పట్టణానికి సమీపంలోని టి.ఎన్. పేట గ్రామం దగ్గర మంగళవారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యారు. సీఐ సురేశ్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన గంగాధర, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు రాజు ఆచారి (26) పావగడ నుంచి కోగిరకు ద్విచక్రవాహనంలో వెళుతున్నాడు. అదే సమయంలో రొద్దం బి.సి కాలనీ వాసి మారుతి ప్రసాద్ పావగడకు వస్తుండగా టి.ఎన్.పేట సమీపంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో పోలీసులు పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజు ఆచారి మృతి చెందగా, తీవ్రగాయాలైన మారుతి ప్రసాద్ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తుమకూరుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. రాజు ఆచారి సోమందేపల్లిలో చేనేత మగ్గాలను నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. మారుతి ప్రసాద్‌కు ఎనిమిది రోజుల క్రితం తాలూకాలోని కడపలకెరె గ్రామంలోని దివంగత గంగాధర, హనుమక్క కూతురు మమతతో వివాహమైంది. ఇద్దరి బంధువుల ఆర్తనాదాలతో ప్రభుత్వ ఆసుపత్రి మారుమ్రోగింది. సంఘటనా స్థలానికి సీఐ సురేశ్, ఎస్ఐ గురునాథ్, ఏఎస్ఐ గోవిందప్ప, పోలీసులు నాగేశ్, శ్రీకాంత్ చేరుకొని స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

వరద బాధితులకు ఆర్థిక సాయం


కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న గోవిందపేట సమితి సభ్యులు

పుట్టపర్తి న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు పుట్టపర్తిలోని గోవిందపేట సమితి సభ్యులు ఆర్థిక సాయం అందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు సమితి సభ్యులు తలిపినేని రామప్ప, ఎంవీనాయుడు(డీలర్), కడియాల కృష్ణమోహన్, షామీర్ రూ.50వేలు చెక్కును అందజేశారు.

కోన కణ్వాశ్రమం నుంచి దత్తానందగిరి స్వామి తొలగింపు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోన కణ్వాశ్రమం నుంచి దత్తానందగిరిస్వామిని శాశ్వతంగా తొలగిస్తున్నట్లు శ్రీమల్లికార్జునస్వామి కణ్వాశ్రమ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆశ్రమంలో కమిటీ సభ్యులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆశ్రమ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కోన పవిత్రతకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నందుకు తొలగించినట్లు తీర్మానించామన్నారు. ఆశ్రమంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం, భక్తులు అందించిన విరాళాల సొమ్ము దుర్వినియోగం చేశాడని తెలిపారు. కమిటీ సభ్యులు అక్రమాలకు పాల్పడుతున్నారంటూ నిరాధారోపణలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఇటు కమిటీ సభ్యుల ప్రతిష్ఠకు భంగం కలిగేలా వ్యవహరించినందుకు గాను ఆశ్రమం నుంచి శాశ్వతంగా తొగిస్తున్నామన్నారు.



ముష్టికోవెలలో తాగునీటి ఎద్దడి

ముష్టికోవెల (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: మండలంలోని ముష్టికోవెల గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని చౌడమ్మ ఆలయ పరిసరాలలో ఉన్న ప్రజలు 15 రోజుల నుంచి నీటి ఎద్దడితో అసౌకర్యానికి గురవుతున్నట్లు చెబుతున్నారు. పది రోజుల కిందటి వరకు అరకొరగానైనా నీరందేదని ఐదు రోజుల నుంచి పూర్తిగా నిలిచిందన్నారు. నిత్యం వ్యవసాయ కూలి పనులకు వెళ్లే తాము నీటిని పట్టుకునేందుకు ఇతర వీధులకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. గ్రామంలోని ఓ వ్యక్తి మంగళవారం తన ఇంటి అవసరార్థం ట్రాక్టర్‌తో నీటి ట్యాంకును తీసుకురాగా ఆయన తరువాత నీటిని పట్టుకునేందుకు స్థానికులు ఎగబడ్డారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి మురళి దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ మోటార్‌కు సంబంధించిన స్టార్టర్ పెట్టెను గుర్తుతెలియని దుండగలు ఎత్తుకెళ్లడంతో నీటి సమస్య తలెత్తిందన్నారు. స్టార్టర్ పెట్టె అమర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నాడు-నేడు ఇంకెన్నాళ్లప్పా?

• రెండేళ్లు గడుస్తున్నా పూర్తి కాని పనులు • విద్యా బోధనకు కష్టాలు

ముదిగుబ్బ, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: 'నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుస్తాం. వసతులు కల్పించి కార్పొరేట్‌కు దీటుగా బోధన అందిస్తామని గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది. నిధుల లేమితో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో రెండో విడత నాడు నేడు పథకం కింద మొత్తం 32 మండలాల్లో 1,081 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో 36 శాతం మరుగుదొడ్లు, 50 శాతం వంట గదుల నిర్మాణం, 63 శాతం విద్యుత్తు పనులు, 50 శాతం మేజర్, మైనర్ మరమ్మతులు జరిగాయి. అసంపూర్తి పనులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

• ధర్మవరం పట్టణంలో రెండో విడత నాడు-నేడులో భాగంగా 62 పాఠశాలల్లో 20 మరుగుదొడ్లు, 3 వంట గదులు, 23 పాఠశాలల్లో తరగతి గదుల మరమ్మతులు, 26 పాఠశాలల్లో విద్యుత్తు పనులు పూర్తయ్యాయి.

ధర్మవరం పట్టణంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాలలో 900 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరికీ సరిపడా గదులు లేకపోవడంతో రెండో విడత నాడు-నేడు కింద రూ.కోటి నిధులు కేటాయించారు. అదనపు తరగతి గదులు రెండు అంతస్తులు నిర్మించారు. అప్పటి నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.



సిమెంటు సరఫరా లేక..

గత వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో సిమెంటు సరఫరా జరగలేదు. దాంతో పనులు ముందుకు సాగడం లేదు. సిమెంట్ కావాలని ఇండెంట్ పెడితే ఆరు, ఏడు నెలలైనా రావడం లేదు. ప్రైవేటుగా కొనుగోలు చేసేందుకు అవకాశం లేదు. దాంతో సిమెంట్ సరఫరా కోసం ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. కొందరు మరొక పాఠశాలకు సరఫరా అయిన సిమెంటును తీసుకుని వినియోగిస్తున్నారు. దానికితోడు అదనపు గదుల నిర్మాణం, మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఇచ్చే కూలీకి, బేల్దారి అడిగే కూలీకి తేడాలు ఉండటంతో సమస్యగా మారింది.

• బత్తలపల్లి 33, తాడిమర్రి 17, ముదిగుబ్బ 44 పాఠశాలలు రెండో విడత ఎంపికైతే 50 శాతం పనులు కూడా పూర్తి కాలేదు.



ముదిగుబ్బ మండలం గరుగుతండా ప్రాథమిక పాఠశాలకు రూ.10.50 లక్షల నిధులు కేటాయిస్తూ రెండో విడత నాడు-నేడు కింద ఎంపిక చేశారు. ఇప్పటి వరకు కేవలం మరుగుదొడ్లు, రెండు సంపులు నిర్మించారు. మిగిలిన పనులన్నీ పెండింగ్ ఉన్నాయి. ప్రధానంగా సిమెంటు సరఫరా కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.

నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం

ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు కొనసాగిస్తాం. సిమెంటు సరఫరా అరకొరగానే ఉండటంతో జాప్యం జరుగుతోంది. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తరగతి గదుల్లో మరమ్మతులు చేయిస్తున్నాం.

- గోపాల్‌నాయక్, రమణప్ప, ధర్మవరం, ముదిగుబ్బ ఎంఈవో

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య: బ్రహ్మదేవరమర్రి గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగు నిల్వ చేరి విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **- గ్రామస్థులు**
పరిష్కారం: ఎంఈవో-2 రమణప్ప గ్రామస్థులతో కలిసి డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించారు.

సమస్య: ఎనుములవారిపల్లి బీసీ బాలుర వసతి గృహంలో కిటికీలకు తలుపులు లేక విద్యార్థులు వణుకుతున్నారు. **- విద్యార్థుల తల్లిదండ్రులు**
సమాధానం: కిటికీలకు తలుపులు, దోమలు రాకుండా మెస్ ఏర్పాటు చేయిస్తాం. **- లలితమ్మ, వసతిగృహ సంక్షేమాధికారిణి**

సమస్య: ముదిగుబ్బలోని సాయినగర్ నుంచి దొరిగల్లు వెళ్లే మార్గంలో టవర్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మించాలి. **- రమణయ్య, ముదిగుబ్బ**
సమాధానం: నిధులు మంజూరైతే నిర్మిస్తాం. **- రవీంద్ర, పీఆర్ జేఈ, ముదిగుబ్బ**




సమస్య: నల్లమాల మండల పరిధిలోని దొన్నికోట గ్రామంలో తాగునీటి పైపులు దెబ్బతిన్నాయి. ట్యాంకు పరిసరాలు శుభ్రం చేయడం లేదు. **- ఆదినారాయణ**

సమస్య: పంచాయతీ కార్యాలయం ఎదుట కాలువను శుభ్రం చేయించాలి. **- రమణప్ప, దొన్నికోట**
సమాధానం: పైపులైను మరమ్మతు, కాలువలు శుభ్రం చేయిస్తాం. **- రామమోహన్, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, ముదిగుబ్బ, నల్లమాడ

అంకితభావానికి గుర్తింపు


భూక్యా కాలేనాయక్


గోనుగుంట్ల విజయ్‌కుమార్

అమడగూరు, న్యూస్‌టుడే: పట్టణ ఆర్థిక మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ సభ్యుడిగా మండలంలోని మలకవారిపల్లి ఎగువతండాకు చెందిన తెదేపా రాష్ట్ర ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి భూక్యా కాలేనాయక్ ఎంపికయ్యారు. తనకు అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రికి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే సింధూరరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. **బత్తలపల్లి:** మండలంలోని మాల్యవంతం గ్రామానికి చెందిన గోనుగుంట్ల విజయ్‌కుమార్‌కి రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం దక్కింది. దీంతో మండల నాయకులు గ్రామస్థులు పెద్ద ఎత్తున బత్తలపల్లి పార్టీ కార్యాలయం వద్దకు చేరుకొని సంబరాలు జరుపుకొన్నారు. ర్యాలీగా కూడలి వద్దకు చేరుకొని బాణసంచా కాల్చారు. మాల్యవంతంలో మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెట్టెం రమణ, రాము, అనంతయ్య, అశ్వర్థ, వెంకటేశు, మనోజ్, సదాశివా, హరి, కృష్ణమనాయుడు, దురగమప్ప, యర్రప్ప, కృష్ణయ్య, బాలకృష్ణ, బుజ్జి, నాగేలినాయుడు, అయ్యప్ప, వెంకట్, నాగభూషణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం


పుట్టపర్తి గ్రామీణం: ఎడ్ల బండిపై మంత్రి సవిత, ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె


ధర్మవరం మండలం గొట్లూరులో రైతులకు సలహాలిస్తున్న ఏడీఏలు కృష్ణయ్య, పద్మావతి

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే తెదేపా ప్రభుత్వ ఆశయమని మంత్రి సవిత అన్నారు. మంగళవారం మండలంలోని నిడిమామిడి గ్రామంలో పొలంబడి కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు గ్రామస్థులు మంత్రి, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఎడ్ల బండి ఎక్కి పొలం వరకు ఊరేగింపుగా వెళ్లారు. పంట పొలాలను పరిశీలించారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. • ముదిగుబ్బలోని సానేవారిపల్లి, ధర్మవరం మండలంలోని గొట్లూరు, నాగలూరు, తాడిమర్రి మండలం చిల్లవారిపల్లి, దాడితోట, తలుపుల మండలం లక్కసముద్రం, ఓబులరెడ్డిపల్లి, నల్లమాడ మండలం ఎద్దులవారిపల్లి తండా, కొండ్రవారిపల్లి, ఓబుళదేవరచెరువు మండలం బాబాసాహెబ్‌పల్లిలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అధికారులు పొలాల బాట పట్టి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు.

రహదారి ఛిద్రం.. ప్రయాణం నరకం

తనకల్లు నుంచి బత్తినవారిపల్లి వరకు చెరువుకట్టపై 560 మీటర్ల పంచాయతీ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. రోడ్డు నిర్మాణం చేపట్టి దాదాపు 12 ఏళ్లు కావస్తున్నా గుంతలకు తారు వేసిన దాఖలాలు లేవు. ఈమార్గంలో ఎగువ, దిగువ బత్తివారిపల్లెలు, చిన్నచెరువుపల్లి, సానెవారిపల్లె, ఈతోడు, చిన్నరామన్నగారిపల్లి పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీనిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజేంద్రను వివరణ కోరగా కట్ట కావడంతో బీటీ రోడ్డు త్వరగా పాడైందన్నారు. ఉన్నతాధికారులకు తెలిపి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, తనకల్లు**



మడుగు కాదు.. మురుగే



శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి వీధుల్లో భూగర్భ మురుగునీరు పొంగి పొర్లుతోంది. వాటి నుంచి వచ్చే దుర్వాసనను ప్రజలు, భక్తులు, పర్యాటకులు భరించలేకపోతున్నారు. వివేకానందనగర్, చిత్రావతిరోడ్డు, గోవిందపేట, గ్రౌండులో ఛాంబర్ల నుంచి మురుగునీరు బయటకు వస్తోంది. మంగళవారం వివేకానందనగర్‌లో మురుగు రహదారులపై ప్రవహించడంతో ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఛాంబర్లను శుభ్రం చేయించి, సమస్య పరిష్కరిస్తామని డీఈ నరసింహమూర్తి తెలిపారు.

- న్యూస్‌టుడే, పుట్టపర్తి

ఫోర్జరీ సంతకాలతో భూమి కాజేశారని ఫిర్యాదు

గాండ్లపెంట : మండల పరిధిలోని వేపరాల పంచాయతీలో ఉన్న భూమిని ఫోర్జరీ సంతకాలతో కాజేశారని మంగళవారం విశ్వేశ్వరరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. సర్వే నంబర్ 191, 192, 193లో తమ అన్నదమ్ములకు ఉన్న భాగాలకు సంబంధించిన భూమిని కదిరి కుమ్మరవాండ్లపల్లికి చెందిన రెడ్డెప్ప ఫోర్జరీ సంతకాలతో పత్రాలు తయారు చేసుకొని తమను బెదిరింపులకు పాల్పడుతున్నాడని బాధితులు ఫిర్యాదు చేశారు. రెడ్డెప్పపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిష్పక్షపాతంగా విచారణ జరిపించండి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ధర్మవరంలో జరిగిన గొడవల్లో తనతోపాటు అనుచరులపై అక్రమంగా కేసులు నమోదు చేశారని, దీనిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కోరారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్నను ఆయన కలిశారు. ధర్మవరం సున్నితమైన ప్రాంతమని, ఫ్యాక్షన్ గొడవలు తలెత్తడం బాధాకరమన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

తలుపుల, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో మంగళవారం సభ్యత్వ నమోదు చేసినట్లు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా కోశాధికారి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 117 జీవో రద్దు చేయాలని, పీఆర్‌సీపైన స్పష్టమైన ప్రకటన చేసి ఐఆర్‌ను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశమిస్తాం: ఎమ్మెల్యే

కదిరి, న్యూస్‌టుడే: పట్టణ, పంచాయతీ పరిధిలో లేఅవుట్లతో వ్యాపారం చేసుకునే వారికి చివరి అవకాశం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. అనుమతి పొందకుండా ప్లాట్లు వేసి కొనుగోలు దారులను ఇబ్బంది పెడుతున్నట్లు పేర్కొన్నారు. బాధితులు పూర్తి ఆధారాలతో వస్తే న్యాయం చేస్తామన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల ఛైర్మన్ జనార్దన్

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆదిత్య పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న అక్షయిని రాష్ట్రస్థాయి జూడో పోటీలలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందింది. మంగళవారం పాఠశాల ఛైర్మన్ జనార్దన్, కోచ్ ఇనాయత్‌బాషా మాట్లాడుతూ రెండు రోజుల కిందట తిరుపతిలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో అక్షయిని పాల్గొని మైనస్ 23 కేజీల విభాగంలో ప్రతిభ కనబర్చి బంగారు పతకం కైవసం చేసుకుందని తెలిపారు. అక్టోబర్ 2, 3 తేదీల్లో గుజరాత్ జరిగే జాతీయ జూడో పోటీలకు ఎంపికైందని చెప్పారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ

తనకల్లు, న్యూస్‌టుడే: తనకల్లు ఎస్ఐగా గోపి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ ధరణిబాబు పుట్టపర్తి వీఆర్‌కు వెళ్లారు. నూతన ఎస్సైకి సిబ్బంది, పలువురు తెదేపా నాయకులు స్వాగతం పలికారు.

పలువురు అధికారుల బదిలీ : తనకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సీనియర్ అసిస్టెంట్ హాజీవలి నల్లచెరువుకు బదిలీ కాగా ఆయన స్థానంలో నల్లమాడలో విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ నియమితులయ్యారు. ఏఓ వెంకటరమణ ఓబులదేవరచెరువుకు, అక్కడ పని చేస్తున్న పి.రెడ్డెప్ప ఇక్కడికి వస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ పి.గిరీష్‌కుమార్ తలుపులకు బదిలీ కాగా కొక్కంటి ఉన్నత పాఠశాల్లో విధులు నిర్వహిస్తున్న రాజేష్‌ను నియమించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కవిత నల్లచెరువు మండలానికి బదిలీ కాగా ఇక్కడికి ఎవరినీ నియమించలేదు.

డిప్యూటీ తహసీల్దార్‌గా కల్యాణ్‌చక్రవర్తి

పుట్టపర్తి గ్రామీణం: పుట్టపర్తి డిప్యూటీ తహసీల్దార్‌గా కళ్యాణ్‌చక్రవర్తి మంగళవారం విధుల్లో చేరారు. ఇక్కడ డీగా పనిచేస్తున్న సురేష్‌బాబు బదిలీపై ధర్మవరం వెళ్లారు.

'ఫ్యాక్షన్ మొదలు పెట్టిందే కేతిరెడ్డి'

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ప్రశాంతమైన ధర్మవరంలో ఫ్యాక్షన్ రాజకీయాలు మొదలు పెట్టిందే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అని తెదేపా నాయకులు విమర్శించారు. మంగళవారం ముదిగుబ్బలోని తెదేపా కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం ధర్మవరంలో ఎన్డీయే కార్యకర్తను కారుతో గుద్ది తర్వాత అందరి లెక్కలు తేలుస్తానంటూ కేతిరెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ ప్రభాకర్, రమేశ్‌బాబు, మహబూబ్‌పీరా, కోట్ల బాబి, వినోద్‌కుమార్, శేఖర్, దొరిగల్లు సూరి, పాళ్యం రాఘవ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

కదిరి, న్యూస్‌టుడే: కదిరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మొత్తం తొమ్మిది కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 316 మంది నిరుద్యోగులు వచ్చారు. వారిలో 97 మంది ఎంపికవగా, 30 మంది షార్ట్‌లిస్టులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్మిత తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మోసం కేసు నమోదు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: రుణాలు వసూలు చేసి ఆ సొమ్మును సొంతానికి వాడుకున్నాడన్న ఫిర్యాదు మేరకు ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగిపై కదిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సైదాపురంలోని స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ ప్రైవేటు కంపెనీలో కదిరికి చెందిన వంశీ క్లర్క్‌గా పనిచేస్తున్నారు. కంపెనీ నుంచి అప్పు తీసుకున్న వేర్వేరు ప్రాంతాలకు చెందిన రుణగ్రస్థుల నుంచి వసూలు చేసిన రూ.3.63లక్షలను వంశీ తన అవసరాలకు వాడుకున్నారు. ఆడిట్‌లో ఈ విషయాన్ని గుర్తించిన కంపెనీ మేనేజర్ లోకేశ్ కదిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పి.కొట్టాల సమీపంలో కోడిపందెం స్థావరాలపై పట్నం పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ముదిగుబ్బ గ్రామీణ సీఐ శ్యామరావు, పట్నం ఎస్సై నరసింహులు తెలిపారు. వారి నుంచి రూ.15,830 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, ఆరు కత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

దాడి కేసులో ఇద్దరు..

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: సన్నిహితంగా ఉన్న వ్యక్తితో కలిసి భార్య భర్తపై దాడి చేసి గాయపర్చింది. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఈ నెల 18న రాత్రి పద్మజ మరో వ్యక్తితో కలిసి వాణివీధిలో ఉండటాన్ని భర్త మధుసూదన్ గుర్తించి నిలదీశారు. ఆగ్రహించిన పద్మజ, ఖాలే షామస్తాన్‌వలితో కలిసి భర్తపై దాడి చేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

వృద్ధురాలి అదృశ్యం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం రాధాకృష్ణవీధికి చెందిన వృద్ధురాలు నూర్జహాన్ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో గాలించినా ఆచూకీ తెలియరాలేదు. మంగళవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

నంబులపూలకుంట(గాండ్లపెంట), న్యూస్‌టుడే: ఆర్థిక సంక్షోభంలోనూ రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఎన్పీకుంట మండలం కొత్తపల్లిలో సర్పంచి చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొలంబడి పోస్టర్‌ను విడుదల చేసి వేరుసెనగ పంటను పరిశీలించారు. రైతులకు రాయితీ ఉలవలు పంపిణీ చేశారు.

కొత్తచెరువు: మండల పరిధిలోని మీర్జాపురంలో ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరయ్యారు. వరద బాధితులకు సాయంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మీనారాయణ రూ.50వేలు, ఇతరులు అందించిన విరాళాలు మొత్తం రూ.2లక్షలను ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేసిన దాతలను ఎమ్మెల్యే, మాజీ మంత్రి అభినందించారు. ఐసీడీఎస్ వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు ఎమ్మెల్యే పసుపు, కుంకుమతో సీమంతం నిర్వహించారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులుగా ఉన్నప్పుడే సమాజానికి మంచి చేయాలనే ఆలోచన ఉంటే, భవిష్యత్తు బంగారుమయంగా ఉంటుందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ జాతీయ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దివాకర్‌రెడ్డితోపాటు మడకశిర కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ సుబ్బయ్య హాజరయ్యారు. ఎస్ఎస్ఎస్‌లో ఉత్తమ క్యాడెట్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపాల్‌నాయక్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వేరుసెనగ ఎండుముఖం


పాయకట్టు వద్ద వేరుసెనగ తొలగిస్తున్న కూలీలు

కదిరి డివిజన్‌లో
సాధారణ సాగు: 72,436 హెక్టార్లు
సాగైనది 33,832 హెక్టార్లు
అందులో వేరుసెనగ సాగు: 22,868 హెక్టార్లు

✦ తొలగించేస్తున్న రైతులు

అదునులో వర్షాలు పడటంతో రైతులు వేరుసెనగ పంట సాగు చేశారు. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి ఆరుగాలం శ్రమించారు. తీరా దిగుబడి చేతికొచ్చే తరుణంలో వరుణుడు ముఖం చాటేశాడు. పంటలు వాడుముఖం పట్టాయి. తడులు అందిస్తామన్నా.. దగ్గర్లోని చెరువులు, కుంటలు, బోరుబావులు అడుగంటిపోయాయి. చేసేదేమీ లేక కొందరు రైతులు పంటను తొలగిస్తున్న దయనీయమిది.

గాండ్లపెంట మండలం పాయకట్టు వద్ద రైతు నరసింహులు, ప్రమీల రెండు ఎకరాల్లో వేరుసెనగ సాగు చేశారు. రూ.40 వేల వరకు పెట్టుబడి ఖర్చు చేశారు. వర్షం పడకపోవడంతో పంట ఎండిపోయింది. కనీసం గ్రాసానికైనా పనికొస్తుందని ట్రాక్టర్‌తో తొలగిస్తున్నారు. రెండెకరాలకు రెండు మూటలు కూడా కావని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్‌కు గంటకు రూ.1,500, కూలీలకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అడుగుతున్నారన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దీనిపై కదిరి ఏడీ సత్యనారాయణ వివరణ కోరగా కొన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పంటలు ఎండిపోతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వాటిని గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.



ఎండిపోయిన వేరుసెనగను చూపుతున్న రైతు నాగభూషణరెడ్డి, పూలవాండ్లపల్లి స్వగ్రామం. బోరు కింద మూడు ఎకరాల్లో వేరుసెనగ పంట సాగు చేశారు. మొదట్లో నీరు బాగా వచ్చేవి. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. పంట పూర్తిగా ఎండిపోయింది. పెట్టుబడి రూ.1.50లక్షలు నష్టపోయారు. పశుగ్రాసం కూడా దక్కని పరిస్థితి. ఇలాంటి దుస్థితి గతంలో ఎన్నడూ చూడలేదని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

- న్యూస్‌టుడే, గాండ్లపెంట, తలుపుల

• దుమ్ము కొట్టుకుపోవాల్సిందే..



ఈ చిత్రంలో రోడ్డును పొగ కమ్మేసిందనుకుంటే పొరబడినట్లే. కదిరి-రాయచోటి రహదారి ఇది. నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైనా పట్టించుకోలేదు. ప్రస్తుతం నిధుల కొరతతో పనుల్లో కాస్తంత జాప్యం జరుగుతోంది. దాంతో కొన్ని చోట్ల రోడ్డును పూర్తిగా తవ్వేసి పనులు చేయకుండా వదిలేయటంతో దుమ్ము రేగి వాహనదారులకు ఇబ్బందులు తప్పటం లేదు. **- ఈనాడు, అనంతపురం**

జాతీయ రహదారిపై ప్రమాద స్థలాల గుర్తింపు

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని 42వ జాతీయ రహదారిపై ప్రమాద స్థలాలను(బ్లాక్‌స్పాట్) కదిరి గ్రామీణ సీఐ నాగేంద్ర, ఎంవీఐ వరప్రసాద్, ఎస్ఐలు గోపి, లింగన్న మంగళవారం పరిశీలించారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నట్లు తెలిపారు. సీసీక్రాస్, మల్లిపల్లి, నల్లచెరువు వద్ద మోడల్ పాఠశాల తదితర ప్రదేశాలను పరిశీలించారు. వాహనాదారులకు అవగాహన కల్పించారు.